25న విఆర్ఎల చలో విజయవాడ

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు కె. గురుమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు డిప్యూటీ తహశీల్దార్ కోటేశ్వరరావుకు మంగళవారం వినతి అందజేశారు. పక్కనే ఉన్న తెలంగాణలో విఆర్ఎలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి ప్రమోషన్లు ఇస్తున్నారని, ఉద్యోగ భద్రత కల్పించారని, ఇక్కడ మాత్రం ఇచ్చిన డిఎను తిరిగి తమ దగ్గర నుంచి ప్రభుత్వం రికవరీ చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమోషన్లు లేవని, పే స్కేల్ అమలు జరగడం లేదని అన్నారు. నామిని విఆర్ఎలను రెగ్యులర్ విఆర్ఎ లు గా గుర్తించలేదని, పని భారం మాత్రం పెంచారని అన్నారు. ఈనేపథ్యంలో ఈనెల 25న చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టామని తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్ , గోపాల్, రాజు, వీరాస్వామి, సన్యాసప్పుడు , రాములప్పుడు, పెంటయ్య, గౌరీ, అప్పారావు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములపై కసరత్తు

- భూముల వివరాల సేకరణ పనిలో యంత్రాంగం
- పెత్తందారుల చెరలో మెజార్టీ భూములు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అసైన్డ్ భూముల రెగ్యులైజేషన్‌కు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రెవెన్యూ యంత్రాంగం భూ సేకరణలో నిమగ్నమైంది. మెజార్టీ భూములు పెత్తందారులు, ఆక్రమణ దారుల చెరలో ఉండడంతో ఆ భూములు తమ వశమౌతాయా? అన్న ఆశ, నిరాశలతో దళితులు ఉన్నారు. 20ఏళ్ల క్రితం నుంచి సాగులోవున్న అసైన్డ్ భూములను దళితులకు రెగ్యులర్ చేస్తామంటూ ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశం ప్రకటించిన విషయం విధితమే. ఈనేపథ్యంలో జిల్లాలో భూముల వివరాలు సేకరించే పనిలో రెవెన్యూ యంత్రాంగం ఉంది. ముఖ్యంగా విఆర్ఒ, ఆర్ఐ స్థాయిలో గ్రామాల వారీగా అసైన్డ్ భూమి సాగుదారులు, వారికి ఏ సంవత్సరంలో ప్రభుత్వం అప్పగించింది. అందులోనూ 2003కు మునుపు ఇచ్చిన భూమి ఎంత? అసైన్డ్ పట్టాదారులే సాగు చేస్తున్నారా? లేక వారి వారసులు సాగు చేస్తున్నారా? అప్పట్లో ఇచ్చిన భూమంతా వీరిచేతిలోనే ఉందా? లేక ఇతరులెవరైనా సాగుచేస్తున్నారా? అన్న కోణంలో భూమి వివరాలు సేకరిస్తున్నామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. విజయనగరం జిల్లాలో ఇప్పటి వరకు 55వేల నుంచి 60వేల ఎకరాలు వరకు అసైన్డ్ భూములు ఉన్నాయని అధికారులు అంచనాగా చెబుతున్నారు.

బొబ్బిలి రెవెన్యూ డివిజన్లో 2004కు ముందు సుమారు 15,837 మంది దళితులకు 15,258.82 ఎకరాలు ఇచ్చినట్టు రెవెన్యూ రికార్డులు చెపుతున్నాయి. బాడంగి మండలంలో 2905 దళిత కుటుంబాలకు 2772.18 ఎకరాలు, బొబ్బిలిలో 3590 కుటుంబాలకు 4113 ఎకరాలు, మెంటాడలో 175 కుటుంబాలకు 411.99 ఎకరాలు, తెర్లాంలో 3394 కుటుంబాలకు 2246.54 ఎకరాలు, రామభద్రపురంలో 2220 కుటుంబాలకు 2762.10 ఎకరాలు, దత్తిరాజేరులో 1269 కుటుంబాలకు 1278.66 ఎకరాలు, గజపతినగరంలో 2286 కుటుంబాలకు 1674.27 ఎకరాలు చొప్పున అసైన్డ్ భూమి ప్రభుత్వం ఇచ్చింది. విజయనగరం, చీపురుపల్లి డివిజన్ల పరిధిలో కూడా ఇదే స్థాయిలో అసైన్డ్ భూములు ఉన్నాయి. దాదాపు ఈ భూముల్లో ఎక్కువ భాగం స్థానిక పెత్తందారులు, రాజకీయ నాయకులు, కొంతమంది ప్రజాప్రతినిధుల చేతుల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీరి ప్రయోజనాల కోసమే ప్రభుత్వం భూములను క్రమబద్ధీకరించేందుకు ప్రయత్నిస్తోందని కొంతమంది వాదన. ఇందుకు తగ్గట్టే బొబ్బిలి, వేపాడ, మెంటాడ తదితర మండలాల్లోని అసైన్డ్ భూములు చాలా కాలం క్రితం వశపర్చుకున్న పెత్తందారులు, రాజకీయ నాయకులు దళితులను మచ్చిక చేసుకుంటున్నారు. అప్పట్లో డబ్బులు ఇచ్చి కొనుక్కున నేపథ్యంలో భూములు రెగ్యులర్ కాగానే తమ పేరున రిజిస్ట్రేషన్ చేసేందుకు సిద్ధంగా ఉండాలని, అవసరమైతే ఎంతో కొంత ఇచ్చేస్తామని అదిరింపులు, బెదిరింపులు, బుజ్జగింపులు చేస్తున్నారు. వెనుకాడితే అప్పట్లో రాసుకున్న తెల్లకాగితాలు, బాండ్‌పేపర్లను బయటకు తీస్తామంటూ హెచ్చరిస్తున్నారు.

సిఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

- పరిశీలించిన తలశిల రఘురాం, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి
- జయప్రదం చేయాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర విజ్ఞప్తి
- పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్ నాగలక్ష్మి

ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న తలశిల రఘురాం

ప్రజాశక్తి-మెంటాడ, దత్తిరాజేరు

మెంటాడ మండలం చినమేడపల్లి వద్ద కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసే నిమిత్తం ఈనెల 25న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. శంకుస్థాపన కార్యక్రమానికి అనువుగా మొక్కలను, పొదలను తొలగించి నేలను చదునుచేసే కార్యక్రమాన్ని రోడ్లు భవనాల శాఖ చేపడుతోంది. మరోవైపు జాతీయ రహదారి నుంచి కుంటినవలస మీదుగా చినమేడపల్లి వరకు 4 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ, పటిష్టపరచడం వంటి పనులను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ నాలుగు కిలోమీటర్ల మార్గంలో ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి ప్రయాణించడంతో వారిని ప్రజలు చూసేందుకు వీలుగా పలుచోట్ల బారికేడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి రోడ్లు భవనాల శాఖ ఇఇ వెంకటరమణను ఆదేశించారు. ముఖ్యమంత్రి హెలిపాడ్ నుంచి కుంటినవలస వరకు రోడ్డు మార్గంలో చేరుకోనున్నందున ఈ మార్గంలో చేయాల్సిన భద్రత ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్‌పి, జెసి కలిసి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి ప్రజలను తరలించేందుకు 200 ఆర్టీసీ బస్సులతో పాటు మరో 150 ప్రైవేటు వాహనాలను సమకూరుస్తున్నారు.

సిఎం పర్యటనను విజయవంతం చేయండి

ఈ ప్రాంతంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటవుతున్న కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం శంకుస్థాపన కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కోరారు. సిఎం కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలసి సిఎం పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో మరడాంలో సభావేదిక వద్ద సమీక్షించారు. ఎమ్మెల్యేలు బొత్స అప్పల నరసయ్య, ఎస్.వి.చినప్పల నాయుడులతో కలసి సిఎం సభావేదిక ఏర్పాట్లను, హెలిపాడ్, శంకుస్థాపన శిలాఫలకం వద్ద ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

గిరిజన వర్శిటీకి మౌళిక వసతులు : నాగలక్ష్మి

జిల్లాలో ఏర్పాటవుతున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి అవసరమైన విద్యుత్, నీటిసరఫరా, రోడ్లు వంటి మౌళిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుందని కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. ఇప్పటికే విశ్వ విద్యాలయం ఏర్పాటుకోసం 560ఎకరాలను సేకరించి అందజేశామన్నారు. మరడాంలో సభావేదిక వద్ద కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ యూనివర్శిటీ ఏర్పాటుకోసం 60 నుంచి 70 ఎకరాలు జిరాయితీ భూమిని సేకరించామన్నారు. మరో రూ.1.37 కోట్లు మాత్రమే పరిహారం చెల్లించాల్సి వుందని వారికి కూడా త్వరలో చెల్లిస్తామన్నారు. గిరిజన విశ్వవిద్యాలయం ద్వారా ఈ ప్రాంతంతో పాటు రాష్ట్రంలోని గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు పెరుగుతాయన్నారు.

ఇంటి డాక్యుమెంట్‌ను అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మి

సొంతింటి కల సాకారం : మేయర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని నగర మేయర్ విజయలక్ష్మి పునరుద్ఘాటించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు డాక్యుమెంట్లను, ఇంటి తాళాలను అందజేశారు. వాస్తవానికి ఈమధ్య డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ సారిపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో భారీ సంఖ్యలో విచ్చేసిన లబ్ధిదారులకు డాక్యుమెంట్లను, ఇంటి తాళాలను అందజేశారు. అయితే అనివార్య కారణాలవల్ల కొంతమంది లబ్ధిదారులు సదరు సమావేశానికి హాజరు కాకపోవడంతో మంగళవారం మిగిలిన 90 మందికి నగరపాలక సంస్థ కార్యాలయంలో డాక్యుమెంట్లను, ఇంటి తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ లబ్ధిదారులకు గృహాలు అందజేయడంలో గత పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, సదుపాయాలు కల్పించకుండా లబ్ధిదారులను అయోమయంలో ముంచారని అన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి స్థానికంగా ప్రత్యేక శ్రద్ధ కనపరచి లబ్ధిదారులకు అనువుగా ఉండే విధంగా అన్ని సౌకర్యాలను మెరుగుపరిచారని చెప్పారు. శ్రావణమాసం నేపథ్యంలో లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకొని సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, సహాయ కమిషనర్ ప్రసాదరావు, హౌసింగ్ కమిటీ సభ్యులు తవిట్రాజు, మారోజు శ్రీనివాసరావు, కార్పొరేటర్లు అల్లు చాణిక్య, పట్టా ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కళలను పరిరక్షించాలి : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కళాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ఉత్తరాంధ్రకే వన్నె తెచ్చిన ఎన్నో కళలు నేడు మరుగున పడుతున్నాయని, వాటిని పరిరక్షించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. ప్రపంచ జానపద కళల దినోత్సవం సందర్భంగా విజయనగరం రాగ సుధా రంగస్థల వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుర్రకథల పోటీలు నిర్వహించారు. బుక్కవీధిలో గల ఆర్య సోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో మంగళవారం జరిగిన పోటీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు బుర్రకథ బృందాలు పాల్గొని ప్రదర్శన లిచ్చాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోలగట్ల.. కళా బృందాల ప్రదర్శనలను తిలకించి, నిర్వాహకులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. జానపద కళ అనేది ఎంతో శ్రమ, పట్టుదల ఉంటే గానీ చేయలేమని, అలా చేసే వారిని ప్రోత్సహించేలా చూడాలని అన్నారు. ప్రాచీన జానపద కళారూపంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఒకప్పుడు విశేష ప్రజాదరణ పొందిన బుర్రకథ... టివి మాధ్యమం ప్రజల్లోకి వచ్చాక కాస్త ఆదరణ కోల్పోయిందని, కరోనా వంటి విపత్కర పరిస్థితుల తర్వాత కొన్ని కళారూపాలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదానికి చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో రాగసుధ రంగస్థల సకల వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కళలను బతికించేందుకు, కళాకారులను ఆదుకునేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కళాకారుల సంక్షేమ సంఘం ప్రతినిధి సుధాకర్ పాల్గొన్నారు.

ఉడా కాలనీలో గడప గడపకూ..

నగరంలోని 43వ డివిజన్ ఉడా కాలనీ ప్రాంతంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జిలు కోలగట్ల తమ్మన్న శెట్టి, డాక్టర్ విఎస్ ప్రసాద్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. ప్రభుత్వం పథకాలు పొందుతున్న లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందజేశారు. స్థానిక సమస్యల పైన ఆరా తీశారు. వాటిపై తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులకు సూచించారు. డాక్టర్ విఎస్ ప్రసాద్ మాట్లాడుతూ అవినీతి, లంచగొండి తనం లేకుండా అర్హులైన వారందరికీ పథకాలు అందుతున్నా యని చెప్పడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనా పటిమకు నిదర్శనమని అన్నారు. కార్పొరేటర్ దాసరి సత్యవతి, డివిజన్ అధ్యక్షుడు వంతరాం సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని స్కానింగ్ సెంటర్లు నడపొద్దు

కొత్తగా 5 స్కానింగ్ కేంద్రాలకు అనుమతి

ప్రజాశక్తి-విజయనగరం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రైవేట్‌గా నడుపుతున్న స్కానింగ్ కేంద్రాలను పిసిపి ఎన్‌డిటి కమిటీ సభ్యులు తరచుగా తనిఖీలు చేయాలని, నిబంధన మేరకు నడపని స్కానింగ్ కేంద్రాలను మూసివేయాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిసిపి ఎన్‌డిటి జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కొత్తగా స్కానింగ్ కేంద్రాల ఏర్పాటుకు 5 దరఖాస్తులు, రెన్యూవల్ కోసం 4 దరఖాస్తులు అందినట్లు డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర రావు తెలిపారు. వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించడమే కాకుండా కమిటీ సభ్యులతో కూడా తనిఖీ చేయించి అనుమతిచ్చారు. అనంతరం మాట్లాడుతూ ఇద్దరు పిల్లల తర్వాత కుటుంబ నియంత్రణ పాటించేలా చూడాలని అన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగే గర్భ స్రావాలను సమీక్షించాలని అన్నారు. సఖి గ్రూప్ లకు గర్భ స్రావాల వలన జరిగే నష్టాల పై అవగాహన కలిగించాలని అన్నారు. సమావేశంలో డిఐఒ డాక్టర్ అచ్యుతకుమారి, దిశ ఎస్ఐ పద్మావతి, పిపి జయలక్ష్మి, నేచర్ సంస్థ ప్రతినిధి దుర్గ, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి బొత్స మూడు రోజుల పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లాలో 3 రోజులు పర్యటించనున్నారు. ఈనెల 23న ఉదయం విజయనగరం చేరుకొని స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారు. 24 న మధ్యాహ్నం 2.30గంటలకు విజయనగరంలో బయలుదేరి పార్వతీపురం చేరుకొని 4.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం లో పాల్గొంటారు. రాత్రి బసకు విజయనగరం చేరుకుంటారు. 25న రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్రీయ గిరిజన యూనివర్సిటీకి శంకుస్థాపన చేసే కార్యక్రమంలో పాల్గొంటారు.

రక్తదాతను అభినందిస్తున్న జనసేన నాయకుడు గురాన అయ్యలు

సేవకు ప్రతిరూపం మెగాస్టార్

జనసేన నాయకులు గురాన అయ్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రముఖ సినీనటులు, మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను జిల్లా చిరంజీవి యువత, అంజనీపుత్ర చిరంజీవి ప్రజా సేవాసంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ లో చిరంజీవి యువత అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు ఆధ్వర్యాన పలువురు రక్తదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జనసేన నాయకులు గురాన అయ్యలు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అన్నిదాణాల్లో కన్నా రక్తదానం మహాగొప్ప దానమని, ప్రేమే లక్ష్యం, సేవేమార్గం అనే సిద్ధాంతాన్ని అలవర్చుకున్న, సేవకు ప్రతిరూపమైన మెగాస్టార్ చిరంజీవి బాటలోనే మెగాభిమానులు నడుస్తూ ఇటువంటి పలుసేవలు చేయటం సమాజానికి ఆదర్శమని అన్నారు ఆదాడ మోహనరావు, దంతులూరి రామచంద్ర రాజు, కె.కృష్ణారావు, జిల్లా చిరంజీవి యువత ప్రతినిధులు పాల్గొన్నారు. అఖిలభారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షులు రమణ స్వామినాయుడు పిలుపుమేరకు స్థానిక ఆంజనేయస్వామి కోవెలలో పూజలు నిర్వహించారు. అనంతరం న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంక్‌లో పలువురు రక్తదానం చేశారు. సాయంత్రం 6 గంటలకు ఆనంద గజపతి ఆడిటోరియంలో మెగాస్టార్ చిరంజీవి చిత్రంలోని పాటలు మ్యూజిక్ ఆర్కెస్ట్రా నిర్వహించారు. మెగా ఫ్యామిలీ అధ్యక్షులు రాంకీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు అభిమానులు పాల్గొన్నారు.

బతుకు పోరాటం

- వెట్టి చాకిరీ నుంచి విముక్తికి ఆందోళనలు
- 24న చలో విజయవాడకు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు సన్నద్ధం

పారిశుధ్య పనులు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు బతుకు పోరాటం చేస్తున్నారు. తమకు పనికితగ్గ వేతనం ఇవ్వాలని, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కలిగించాలని, ఉద్యోగ భద్రత కలిపించాలని కోరుతున్నారు. ఇందుకోసం దశల వారీగా నెల రోజులుగా పోరాటం సాగిస్తున్నారు. ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకునేందుకు 24న చలో విజయవాడ వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

జిల్లా కేంద్రంతో పాటు రాజాం, బొబ్బిలి, నెల్లిమర్ల మున్సిపాలిటీల్లో 895 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపాలిటీల్లో 350 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు ఉన్నారు.వీరిలో పారిశుధ్య కార్మికులతో పాటు వాటర్ వర్క్స్, పంపు హౌస్, వాటర్ సప్లయ్, ప్లాంటేషన్ కార్మికులు, క్లాప్ వాహన డ్రైవర్లు ఉన్నారు. వీరంతా తమకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్, కార్పొరేషన్ కమిషనర్లకు, స్థానిక ఎమ్మెల్యేలకు వినతులు అందజేశారు. అయినా ప్రభుత్వం నుంచి సరైన సమాధానం రాకపోవడంతో పనులు బంద్ చేసి ఈనెల 24న చలో విజయవాడకు తరలి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ప్రధానంగా మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, టైమ్ స్కేల్ వర్తింప చేయాలని కార్మికులు కోరుతున్నారు.

అధికారంలోకి వేస్తే సమాన పనికి సమాన వేతనం, సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతున్నారు. ఆప్కాస్‌లో ఉన్న కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవ్ డబ్బులు చెల్లించాలని, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలి, రిస్క్, హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రోజూ రోజుకు పట్టణాల విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచకపోవడంతో పని భారం అధికంగా ఉంది. రక్షణ, భద్రతా సౌకర్యాలు, పనిముట్లు సకాలంలో ఇవ్వడం లేదు. దీంతో కార్మికులు రోగాలు బారిన పడి మరణిస్తున్నారు.

అరకొర వేతనాలతో క్లాప్ వాహన డ్రైవర్లు

క్లాప్ వాహన డ్రైవర్లకు అరకొర వేతనాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. తమకు రూ.18,500 జీతం చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు. ఇవన్నీ రాష్ట్ర వ్యాప్త సమస్యలు అయితే స్థానికంగా అనేక సమస్యలు కార్మికులు ఎదుర్కొంటున్నారు. వాటిలో ప్రధానంగా రామతీర్థాలు, ముషిడిపల్లి, నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్‌లో పనిచేస్తున్న 70 మందిని టర్న్‌కీ సిస్టం రద్దు చేసి ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. ప్లాంటేషన్ విభాగంలో 60 మందిదీ అదే పరిస్థితి. ఆప్కాస్ వచ్చిన తరువాత ఏడుగురు కార్మికులు రిటైర్ అయ్యారు, వారి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారు. 2020 ఆగస్టు 1 తరువాత మరణించిన కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల కుటుంబాలకు రూ.2 లక్షలు ఆర్థిక సహాయం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. మరోవైపు ప్రభుత్వం 3నెలలుగా హెల్త్ అలవెన్స్ బకాయి చెల్లించాల్సి ఉంది. అంతే కాకుండా యూనిఫాం, గ్లౌజులు, చెప్పులు, నూనె వంటి రక్షణ పరికరాలు రెండేళ్లగా పంపిణీ చేయక పోవడంతో కార్మికులు రోగాలు భారిన పడుతున్నారు.

ఆప్కోస్ వద్దు.. పర్మినెంట్ చేయాల్సిందే!

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని ప్రకటించారు. మహాసంకల్ప యాత్రలో భాగంగా విజయనగరం కొత్తపేట వద్ద జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చాం. 'మున్సిపల్ కార్మికుల కాళ్లు కడిగి ఆ నీళ్లను నెత్తిన జల్లుకున్నా వారి రుణం తీర్చుకోలేనిది . లక్ష రూపాయలు జీతం ఇచ్చిన తక్కువే. మూడు నెలలు ఆగండి మన ప్రభుత్వం వస్తుంది. అందర్నీ పర్మినెంట్ చేస్తాం' అంటూ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా పర్మినెంట్ చేయలేదు. పర్మినెంట్ చేసి మాట తప్పని మడం తిప్పని నేతగా ముఖ్యమంత్రి రుజువు చేసుకోవాలి. లేదంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

- ఎ.జగన్మోహన్‌రావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు

పెత్తనం చెలాయించే వారు అధికం

మున్సిపల్ కార్మికులపై పెత్తనం చెలాయించే సిబ్బంది ఎక్కువయ్యారు. సచివాలయ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కార్మికులకు చిన్న చిన్న కారణాలకు కూడా ఎలాంటి నోటీసులు లేకుండా రోజుల తరబడి పనుల నుంచి నిలుపుదల చేస్తున్నారు. మరోవైపు పెరుగుతున్న పని భారం, ఒత్తిడి కారణంగా అనేకమంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న పోరాటంలో చలో విజయవాడ కార్యక్రమం ద్వారా కార్మికులు సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు.

కమిషనర్ కు సిఐటియు నోటీసులు

తమ సమస్యల పరిష్కారానికి ఈనెల 24 నుంచి పనులు బంద్ చేసి చలో విజయవాడకు వెళ్తున్నట్లు మంగళవారం అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావుకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కె.జగన్మోహన్ కార్మికులతో కలిసి నోటీసు అందజేశారు. చలో విజయవాడ కు కార్మికులు అధిక సంఖ్యలో తరలి రావాలని జగన్మోహన్ పిలుపునిచ్చారు.

రక్తదానం చేస్తున్న యువత

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక బ్రిడ్జి క్రింద జనసేన మండల పార్టీ అద్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిభిరానికి విశేష స్పందన లబించింది. ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిభిరంలో 75 యూనిట్లు బ్లడ్‌ను జన సైనికలు, నాయకులు, యువత దానం చేశారు. ఈ శిభిరాన్ని నెల్లిమర్ల నియోజకవర్గం నాయకులు లోకం మాదవితో పాటు జిల్లా జనసేన నాయకులు గురాన అయ్యలు, ఉత్తరాంధ్ర మహిళా కో ఆర్డినేటర్ తుమ్మి లక్ష్మిరాజ్ తదితర నాయకులు సందర్శించి జనసైనికులును అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా చిరంజీవి జన్మధినోత్సవం సందర్భంగా ఈ రక్తదానం శిభిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. చిరంజీవి చూపిన సేవాభావంతో ఈ కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. రక్తదాన శిభిరంలో మండల పార్టీ అధ్యక్షులు జలపారి అప్పడుదొర (శివ), నాయకులు బూర్లె విజయశంకర్, స్మార్ట్ రమేష్, కె. రమేష్, మాదేటి ఈశ్వర్రావు, బలభద్రుని జానకిరామ్, అప్పలరాజు పాల్గొన్నారు.

పాతబొబ్బిలిలో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీలోని పాతబొబ్బిలిలో కాంగ్రెస్ నేతలు మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెసును గెలిపించాలని ప్రజలను పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సామాజిక పింఛన్ రూ.4వేలు, గ్యాస్ సిలెండర్ రూ.500కే సరఫరా చేస్తుందని చెప్పారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పాలన చేస్తున్న బిజెపిను ఓడించి ప్రజా పాలన కోసం కాంగ్రెసును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన నాయకులు మండపాక శ్రీనివాసరావు, బి.బలరాం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూయల్ పరిశ్రమకు పెట్టుబడి ఎంత?

ప్రజాశక్తి- బొబ్బిలి

గ్రోత్ సెంటర్‌లో మంత్రి బొత్స సత్యనారాయణ పెట్టనున్న సత్య బయో ఫ్యూయల్ పరిశ్రమను ఎంత పెట్టుబడితో పెడతారు, ఎంతమందికి ఉపాధి కల్పిస్తారో బహిరంగంగా ప్రకటించాలని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి డిమాండ్ చేశారు. జనసేన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రోత్ సెంటర్లో భూములు అక్రమాలపై గతంలో జనసేన వెలుగులోకి తెచ్చిందన్నారు. అడ్డగోలుగా భూములను తీసుకోవడం దుర్మార్గమన్నారు. మంత్రి బొత్సకు తక్కువ ధరకు భూములు కేటాయించడంతో ఎపిఐఐసికు కోట్లాది రూపాయలు నష్టం వచ్చిందన్నారు. గ్రోత్ సెంటర్లో ఏర్పాటు చేసే పరిశ్రమలలో స్థానికులకు, భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులు, స్థానికులకు న్యాయం చేయకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయ ఎంపియుపి పాఠశాలను ఎంఇఒ పి. బాలభాస్కర్ రావు మంగళవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా విద్యార్థుల నోట్ బుక్స్, వర్క్ బుక్స్ ఉపాధ్యాయులు డైరీ, లెసన్ ప్లాన్స్, రీడింగ్, రైడింగ్, రాగి జావలను పరిశీలించారు. ఈ పరిశీలనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపు పరిశీలన

ప్రజాశక్తి - జామి

ఈ ఏడాది జనవరి 6వ తేదీ నుంచి ఇప్పటి వరకూ జరిగిన ఓటర్ల తొలగింపు పై పునఃపరిశీలన చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అదేశాల మేరకు చర్యలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా జామి తహశీల్దార్ కార్యాలయంలో క్లేయిములు పరిశీలన చేపట్టారు. డిసిఒ రమేష్ ఈ కార్యక్రమంలో పాల్గొని పరిశీలించారు. జిల్లాలో ప్రతీ నియోజకవర్గానికి ఒక జిల్లా అధికారికి కలెక్టర్ తరపున పరిశీలకులుగా నియమించారు. అందులో భాగంగా గజపతినగరం నియోజకవర్గ పరిశీలకులుగా జిల్లా కోపరిటివ్ అధికారి రమేష్‌ను నియమించగా, తహశీల్దార్ హేమంత్ కుమార్ సమక్షంలో క్లైయిమ్‌లు పరిశీలన చేపట్టారు.

కుక్కల స్వైర విహారం

ప్రజాశక్తి - వంగర

మండలంలోని ఎం సీతారాంపురంలో వీధి కుక్కలు మంగళవారం స్వైర విహారం చేసి గ్రామానికి చెందిన బలగ జయరాం, ముదిలి పైడిరాజు, ఒమ్మి నాగమ్మ, దుప్పాడ సింహాచలంలకు చెందిన పాడి పశువులను గాయపరిచాయి. వీటన్నింటికీ పశు వైద్య సిబ్బంది చికిత్స అందించారు. పాడి పశువులకు వీధి కుక్కలు గాయపరచడంతో పాడి రైతులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలు ఇలా పాడి పశువుల పై, మనుషులపై దాడి చేయకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు కషాయాలు సరఫరా చేయాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రకృతి వనరుల కేంద్రం ద్వారా కషాయాలు, ద్రవాలు రైతుకు సరఫరా చేయాలని డిపిఎం ఆనందరావు ఆదేశించారు. మంగళవారం మండలంలో యస్‌జీ పేట యూనిట్‌లో యస్‌జీపేట, వినాయకపల్లి గ్రామాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంట సాగు చేస్తున్న రైతులకు గ్రోత్ కోసం జీవామృతం పీట్, పురుగులు నివారణకు గ్రీజు పళ్ళాలు, వరి గట్లు పై బహుళ పంటలు వేయడం గురించి, వాటికి అవసరమైన కషాయాలు, ద్రావణంలు రైతులకు వివరించారు. ప్రకృతి వనరులు కేంద్రం ద్వారా ద్రావణంలు, కషయాలు వంటివి రైతులకు సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విఏఏ రవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, అరిగి ఈశ్వరమ్మ, ఐసిఅర్‌పి సిరపరపు రాము, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక స్వాధీనం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చంపావతి నదీ పరివాహక ప్రాంతంలో అక్రమంగా డంప్ చేసిన ఇసుకను మంగళ వారం రెవెన్యూ అధికార్లు, విజిలెన్స్ అధికారులు దాడుల జరిపి స్వాధీనం చేసుకుని స్థానిక తహశీల్దారు కార్యాలయానికి తరలించారు. అనుమతులు లేకుండా నదీలో అక్రమంగా తవ్వకాలు జరిపి ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శంబంగి లక్ష్మీ

పనులు సక్రమంగా చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ప్రభుత్వ నిధులతో చేసే పనులు సక్రమంగా చేయాలని ఎంపిపి శంబంగి లక్ష్మీ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 2022 - 2023 సంవత్సరానికి సంబంధించిన రూ.19 కోట్ల ఉపాధి హామీ నిధులపై పబ్లిక్ హియరింగ్ నిర్వహించారు. గత నెల 22వ తేదీ నుండి ఈనెల18 వ తేదీ వరకు గ్రామాలలో సోషల్ అడిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ వలసలు నివారించడానికి ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో అవినీతికి తావులేకుండా చూసే భాద్యత ప్రతీ ఉద్యోగికి ఉందన్నారు. దిబ్బగుడ్డివలస గ్రామంలో అవినీతి చోటు చేసుకొందని ఆగ్రామ యంపిటిసి నాగరాజు ప్రశ్నించారు. ఈ కార్యక్రమం పూర్తి అయ్యేందుకు సమయం పడుతుందని వివరాలు తరువాత ప్రకటిస్తామని ఎస్ఆర్‌పి అచ్యుతు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ రవికుమార్, జిల్లా ఎపిడి లక్షణరావు, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, క్లస్టర్ ఎపిడి జనార్ధన రావు, ఎపిఒలు రాజు, జనార్ధన్ రావులు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మ పండగ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట, వేపాడ గ్రామాల్లో పరదేశమ్మ పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం అర్జునమ్మ, గ్రామ పెద్దలు ఎం రమణ, సిహెచ్ దేవుడు తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం

ప్రజాశక్తి- గరివిడి

వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాలని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. చీపురుపల్లి పట్టణంలోని శివాలయం వీధి, డైలీ మార్కెట్లో మహాశక్తి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబునాయుడు పొందుపరిచిన అంశాలను ఇంటింటికి వెళ్లి నాగార్జున, పార్టీ నాయకులు వివరించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలూ తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు ప్రజలు చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. వైసిపి విధానాలతో నిరుద్యోగులు, రైతులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా వైసిపి ప్రభుత్వాన్ని ఎంత వేగంగా బంగాళాఖాతంలో కలిపేద్దామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలో అన్ని ఎమ్మెల్యేలు, ఎంపి స్థానాన్ని టిడిపి అభ్యర్థులనే గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రౌతు కాము నాయుడు, దన్నాన రామచంద్రుడు, రౌతు కాంతమ్మ, ఆరతి సాహూ, రామ చంద్ర సాహు, లెంక రాధ, పిల్లా కృష్ణవేణి, ముల్లు రమణ, దన్నాన సూరపనాయుడు, సనపతి శ్రీనివాస రావు, గవిడి నాగరాజు, రెడ్డి లక్ష్మణరావు, సబ్బి సోనియా, లెంక లక్ష్మణరావు, మీసాల కాశీ, వెంపడాపు లక్ష్మనాయుడు, శ్రీధర్ నాయుడు, కోరాడ కోటేశ్వరరావు, మోపాడ తెజేశ్వరరావు, సప్ప సూరప్పడు, గడే సన్యాసప్పల నాయుడు, గంట్యాడ సత్యనారాయణ, బుంగ మహేష్, పైల త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: టిడిపి మేనిఫెస్టో గురించి వివరిస్తున్న కిమిడి నాగార్జున

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వైసిపి పాలన

రామభద్రపురం: రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వైసిపి ప్రభుత్వ పాలన ఉందనీ రాబోయే ఎన్నికల్లో ఈ ప్రభుత్వ పాలనకు ప్రజలు చరమ గీతం పలకడం తథ్యమని బొబ్బిలి నియోజకవర్గ టిడిపి ఇంచార్జి బేబీనాయన అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మాట్లాడారు. ప్రజలతో నేరుగా ఎన్నికైన గ్రామ సర్పంచ్‌లకు నిధులు, విధులు కల్పించకుండా హక్కులను కాలరాస్తుందని, రాజ్యాంగంలో పొందుపరచిన వారి హక్కులకు భంగం కలిగిస్తూ వాలంటీర్లు ద్వారా నేరుగా కార్యక్రమాలు జరిపించడం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన సర్పంచులను అవమానించడమేనని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నేరుగా 14,15 ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఖాతాలకు జమ చేస్తున్నా, ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత ఖాతాలోకి మార్చుకుని స్థానిక ఎమ్మెల్యే సిఫార్సు చేసిన పనులకు మల్లిస్తున్నారని దుయ్యబట్టారు. గడపగడపకు ప్రభుత్వం పేరిట అదే ఎమ్మెల్యేలను ఇంటింటికి తిప్పుతూ వారు ఆమోదించిన పనులు మాత్రమే మంజూరు చేస్తూ గ్రామ ప్రథమ పౌరులను డమ్మీలను చేసారని ఆవేదన చెందారు. ఉపాధి హామీ పథకం నిధులతో చేస్తున్న పనులకు కూడా పంచాయతీ తీర్మానాలు అవుసరం లేదని తమ స్వంత కార్యకర్తలకు పనులు మంజూరు చేస్తున్నారని విమర్శించారు. అనంతరం కొట్టక్కి జాతీయ రహదారి నుండి వెళ్లే రహదారి పరిశీలించి మాట్లాడారు. ఈ రోడ్డు నరకాన్ని తలపించే విధంగా ఉందని, ఇటీవలే నిర్మించిన రహదారి కొద్ది రోజులకే ఇలా పాడవడం ఈ ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అవినీతికి నిదర్శనమన్నారు. వెంటనే కొట్టక్కి గ్రామ చెరువుకు రక్షణ గోడ నిర్మించాలని, పోత మట్టివలన దిగబడిపోతున్న మట్టి తీసివేసి, వెంటనే కంకర వేయాలని డిమాండ్ చేశారు. ఆ రహదారి మార్గంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, స్థానిక మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ చింతల రామకృష్ణ, సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, ఎంపిటిసి వసంతుల తిరుపతి, మండల పార్టీ అధ్యక్షులు కరణం విజయభాస్కర్, ఉపాధ్యక్షులు సిరిపురపు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చింతల చిన్నమ్మతల్లి తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం..కొట్టక్కి రోడ్డును పరిశీలిస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన

అభివృద్ధికి టిడిపి అడ్డంకి

ప్రజాశక్తి- గరివిడి

ఉత్తరాంధ్ర అభివృద్ధికి టిడిపి నాయకులు అడ్డుపడుతున్నారని వైసిపి చీపురుపల్లి మండల సీనియర్ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, అన్నారు. మంగళవారం చీపురుపల్లి వైసిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొబ్బిలి గ్రోత్ సెంటరులో మంత్రి బొత్స సత్యనారాయణ సోదరులు పరిశ్రమ పెట్టుకోవడానికి ముందుకువస్తే ప్రభుత్వం పరిశ్రమ కోసం స్థలం కేటాయిస్తే టిడిపి నాయకులు బేబీనాయన, కిమిడి నాగార్జున, కెఎ నాయుడు బొబ్బిలి ఆర్‌డిఒ కార్యాలయం ముందు ధర్నా చేసి వారికి ఇష్టమొచ్చినట్లు మాట్లాడం సిగ్గుచేటన్నారు. జిల్లా అభివృద్ధి చెందకుండా టిడిపి నాయకులే అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో కిమిడి నాగార్జున సోదరుడు, కిమిడి కళా వెంకటరావు తనయుడు కిమిడి రామ్ మల్లిక్ నాయుడు రణస్థలం దగ్గర పవర్ ప్లాంట్ కోసం ప్రభుత్వం దగ్గర తక్కువ రేటుకు 9 ఎకరాల ప్రభుత్వ స్థలం తీసుకోలేదా అని ప్రశ్నించారు. ఇప్పటికి సుమారు 8 సంవత్సరాలు అయినప్పటికీ పరిశ్రమ పెట్టనందుకు ప్రభుత్వం స్థలం వెనక్కుతీసుకునే ప్రయత్నం చేస్తే కిమిడి కళా వెంకటరావు కుమారుడు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు బెల్లాన వంశీ కృష్ణ, కరిమజ్జి శ్రీను, పతివాడ రాజారావు, చందక గురునాయుడు, మీసాల వెంకటరమణ, బెల్లాన త్రినాద్, కోరుకొండ దాలయ్య పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్తు కోతలు నివారించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వం అప్రకటిత విద్యుత్ కోతలు నివారించాలని వామ పక్ష నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అప్రకటిత విద్యుత్ కోతలను వ్యతిరేకిస్తూ సిపిఎం, సిపిఐ, న్యూడెమొక్రసీ ఆద్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వినియోగ దారులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వామ పక్ష నేతలు మాట్లడుతూ ప్రభుత్వం అప్రకటిత విద్యుత్ కోతలు అమలు చేసి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం దారుణమన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ముందస్తు సమాచారం లేకుండా 3గంటలకు పైగా విద్యుత్ కోతలు అమలు చేయడం భావ్యం కాదన్నారు. కోతలు గురించి వినియోగ దారులు అడిగితే ఎప్పుడు విద్యుత్ వస్తుందో తెలీదని చెబుతున్నారని తెలిపారు. గృహ వినియోగదారుల నుంచి యూనిట్‌కి ఒక రూపాయ నుంచి రెండు రూపాయలకు పైగా విద్యుత్ బిల్లులు అదనపు ఛార్జీల పేరిట భారీగా వసూళ్లు చేస్తున్న ప్రభుత్వం నాణ్యమైన అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. రాత్రి వేళల్లో అనధికార విద్యుత్ కోతలు అమలు చేయడం వల్ల వృద్దులు, చిన్న పిల్లలు, రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పగటి పూట విద్యుత్ ఎప్పుడూ ఉంటుందో తెలియదని ప్రస్తుతం వరి నాట్లు జరిగి సాగు నీటి కోసం మోటార్ వేసి ఇంటికి వెళ్లిన రైతుకి తిరిగి వచ్చేసరికి మోటారు ఆగిపోయే పరిస్థితి ఎదురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనధికార విద్యుత్ కోతలు నివారించకపోతే సబ్ స్టేషన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం సబ్ స్టేషన్ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వామ పక్షాల నేతలు కిల్లంపల్లి రామారావు, తాలాడ సన్ని బాబు, మొయిద పాపారావు, కాళ్ళ అప్పల రాజు తదితరులు పాల్గొన్నన్నారు.

విద్యుత్తు సిబ్బందికి వినతి పత్రాన్ని అందిస్తున్న వామపక్ష నాయకులు

అవయవ దానంతో పునర్జన్మ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సమాజంలో ప్రతి ఒక్కరూ అవయవ దానం చేయడానికి ముందుకు రావాలని ఛాన్సెలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు పిలుపునిచ్చారు. మంగళవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, స్టెప్ ఇన్ ఫర్ హెల్ప్ సంస్థల సహకారంతో అవయవాల దానంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ మనిషి చనిపోయిన తరువాత కూడా మరొకరికి ఉపయోగ పడటం గొప్ప విషయమన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ కెఆర్‌డి ప్రసాద్ మాట్లాడుతూ మనిషి లాగే చెట్లకు ప్రాణం వుందని వాటిని చూసైనా మనిషి ప్రేరణ పొంది అవయవాల దానానికి ముందుకు రావాలన్నారు. సిఐ డి. బంగారుపాప అవయవ దానం చేయడానికి ముందుకు వచ్చారు. ప్రముఖ అడ్వకేట్ ఎస్ఎస్-ఎస్ఎస్ రాజు మాట్లాడుతూ పురాణాలలో శిబి చక్రవర్తి అవయవ దానం చేసారని గుర్తు చేశారు. డాక్టర్ ఎఆర్‌కె నాయుడు ఎన్ని రకాల అవయవ దానాలు చేయవచ్చునో వివరించారు. అనంతరం ఐదు అవయవాలను దానం చేసిన సంతోష్ తల్లి దండ్రులను, అతిథులను ఛాన్సలర్ జిఎస్ఎన్ రాజు సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణ రావు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి ఎ. సత్యం, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ఎస్ వర్మ, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ డాక్టర్ సన్నీ డియోల్, ప్రొఫెసర్ శాంతమ్మ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సెంచూరియన్ యూనివర్శిటీ చాన్సలర్ జిఎస్ఎన్‌రాజు

ఆరోగ్యమే.. మహా భాగ్యం

మనం ఆరోగ్యంగా ఉండాలంటే మన పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని అసోసియేట్ డీన్ డాక్టర్ కె. విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దాదాపు 80 శాతం వ్యాధులు కేవలం పరిశుభ్రత లేక బాక్టీరియా వల్ల కలుగుతున్నాయన్నారు. మనం పరిశుభ్రత పాటిస్తే అవి దరి చేరవన్నారు. పరిశుభ్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ఎస్ వర్మ, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, హౌస్ కీపింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వంగర: ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎంఆర్‌సి సిబ్బంది

ఎంఆర్‌సి సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని ఎంఆర్‌సిలో పనిచేస్తున్న సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భగా సిఆర్‌పిలు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరిస్తామని సిఎం జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి నాలుగేళ్లవుతున్నా ఇంత వరకూ పరిష్కరించలేదన్నారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు

వంగర: 2014 నాటికి సమగ్ర శిక్షా సొసైటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని వారంతా డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద మంగళవారం భోజనం విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై నెల జీతం బడ్జెట్‌ను వెంటనే విడుదల చేయాలని, ప్రతి నెల ఒకటవ తేదీకి వేతనాలు చెల్లించాలని, ఎంటిఎస్ అమలు చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు కిరణ్, తవిటినాయుడు, పారయ్య తదితరులు పాల్గొన్నారు.

పణుకువలసలో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని పణుకువలసలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి బొబ్బిలి మండల అధ్యక్షులు వేణుగోపాల్ నాయుడు, ఎంపిపి ఉమాలక్ష్మి, సత్యనారాయణ, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తెర్లాం: పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

షటిల్ కోర్టు ఏర్పాటు చేయాలి

నెల్లిమర్ల: నగర పంచాయతి పరిధి గాంధీ నగర్ కాలనీలో షటిల్ బ్యాడ్మింటెన్ కోర్టు ఏర్పాటు చేయాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పల నాయుడుని షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిదులు స్థానిక గాంధీ నగర్ కాలనీలో కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై వెంటనే స్పందించి కోర్టు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదేశించారు. ఆటస్థల కేటాయింపు అవసరాన్ని ఎమ్మెల్యేకి వైసిపి సీనియర్ నాయకులు చిక్కాల సాంబశివరావు వివరించారు. ఆ మేరకు ఎమ్మెల్యే గాంధీ నగర్ కాలనీలో ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని గుర్తించి కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పైడిరాజు, లక్ష్మణరావు, రవికిరణ్ నల్లి శివ, శేఖర్, మురళి, రామారావు, రంగారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి ప్రభుత్వం చేసిందేమిటి?

ప్రజాశక్తి - వేపాడ

అంగన్‌వాడీ సిబ్బందికి ఈ ప్రభుత్వం ఏం చేసిందని టిడిపి మండల మహిళా చైతన్య కమిటీ చైర్‌పర్సన్, బానాది ఎంపిటిసి గొంప తులసి ప్రశ్నించారు. తన స్వగృహంలో ఆమె మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు ఈ ప్రభుత్వం పెంచిన జీతం కేవలం రూ.1000 మాత్రమేనన్నారు. చంద్రబాబు సమయంలో అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.10,500 ఉంటే ఇప్పుడు రూ. 11500 ఇస్తున్నారని హెల్పర్లు, మినీ వర్కర్లకు రూ. 6వేలు ఉంటే ఇప్పుడు రూ.7వేలు ఇస్తున్నారని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు మాత్రం జగన్ తెలంగాణ సర్కారు కంటే ఇక్కడ అంగన్‌వాడీకి రూ. 1000 ఎక్కువ ఇస్తామని చెప్పారన్నారు. ఇప్పుడు తెలంగాణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ. 13,650, వర్కర్లకు రూ.7,800 ఇస్తున్నారని మరిక్కడ జగన్ ఎంత ఇస్తున్నారో చూసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీను కూడా నెరవేర్చలేని సిఎం జగన్మోహన్‌రెడ్డిని గద్దె దించాలన్నారు.

మాట్లాడుతున్న తులసి

బాధితులకు ఆర్థిక సాయం

వేపాడ: మండలంలోని ఓబలయపాలెం (కాకులపాలెం)లో కిడ్నీ రోగి సిమ్మ దేవుడమ్మకు, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కానూరి బంగారయ్య దహన సంస్కారాలకు చెరో రూ. 5వేలు చొప్పున మంగళవారం ఎల్లమాంబ యువజన సేవా సంఘం సభ్యులు అందజేశారు. సహాయం అందజేసిన సంఘ సభ్యులందరికీ గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక పురపాలక సంఘం 4, 31వ వార్డుల్లో సుమారు రూ.18లక్షలతో నూతనంగా నిర్మించబోయే సిసి రోడ్లు, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణానికి మంగళవారం బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీను నేరవేర్చిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, మున్సిపల్ కమిషనర్ ఎస్ శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ జేసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో ఆహా కేంటీన్ ప్రారంభం

బొబ్బిలిలో ఆహా కేంటీన్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ప్రారంభించారు. రైల్వే స్టేషన్ జంక్షన్‌లో ఈ కేంటీన్‌ను ప్రారంభించి భోజనం, టిఫిన్ విక్రయ కౌంటర్‌ను ప్రారంభించారు. ప్రజలకు నాణ్యమైన భోజనాన్ని, టిఫిన్‌ను సరసమైన ధరలకు అమ్మేందుకు ఆహా కేంటీన్ ప్రారంభించినట్లు ఎమ్మెల్యే శంబంగి చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవా లని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది, పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు వెంకటేష్

వ్యాధులపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- గజపతినగరం

స్థానిక శ్రీ సాయి బాలాజీ ఆస్పత్రిలో నియోజకవర్గ ఆర్ఎంపి గ్రామీణ వైద్యులకు సీజనల్ వ్యాధులపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అత్యవసర వైద్య నిపుణులు డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యవసాయదారులు పొలాల్లో ఎక్కువగా తిరుగుతూ ఉండటం వల్ల పాము కాటు గురయ్యే అవకాశం ఉందని పాము కాటు వ్యక్తిని ఆందోళన పడకుండా వ్యక్తి కదలకుండా దగ్గరలో వున్న ఆసుపత్రికి తరలించాలని సూచించారు. డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ విజయ్ సాధారణ వ్యాధులు డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం పిఎంపి కార్యవర్గ సభ్యులు ఎల్ఎస్ నాయుడు, ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ అధ్యక్షులు జంగం జోషి, జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి, జోనల్ ఉపాధ్యక్షులు అల్లాడ త్రినాద రావు, కోట్ల పైడిరాజు, కోశాధికారి ఉమాశంకర్, గుప్త తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి- విజయనగరం

పట్టణంలో అలకనంద కాలనీకి చెందిన వెంపడాపు వెంకటలక్ష్మి (20) అనారోగ్య సమస్యతో సోమవారం రాత్రి ఇంటి వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న రామకృష్ణ, రమణమ్మ దంపతుల కుమార్తె వెంకటలక్ష్మి గత కొంతకాలంగా తలనొప్పి సమస్యతో బాధపడుతుండడంతో చికిత్స చేయించుకున్న ఫలితం దక్కలేదు. కుట్టు పని చేసే వెంకటలక్ష్మి అనారోగ్య సమస్యలు తట్టుకోలేక మేడపై ఒక గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేల బావిలో జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని కుంటినవలస గ్రామంలో నేల బావి నుండి నీరు తోడుతుండగా ప్రమాదవశాత్తు ఇద్దరు మహిళలు జారీ పడిపోయారు. ఈ ప్రమాదంలో యాసరపు ఈశ్వరమ్మ (43) చనిపోగా మరో మహిళను గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఊహించని రీతిలో ఈశ్వరమ్మ మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE: VIZIANAGARAM
I.A. /2023 IN O.S.390/217

Between:
Smt.Bollu Lakshmi and other
......Petitioners/Plaintiffs
And:
Smt. Bollu Ammaji and others
.....Respondents/Defendants
TO: -
DEFENDAN NO : 4
Smt. Bollu Kistamma, W/o.late Tatayyalu, R/o.Singavaram Village, Denkada Mandal, Vizianagaram District.

NOTICE

Please take notice that the above named plaintiffs filed a suit against respondents/ defendants 1 to 6 and the defendant for partition of the plaint schedule properties into five shares and to allot one such share to the plaintiffs of the plaint schedule property and hand over vacant possession of the said property, and the same stands posted to **4-9-2023** on that day you have to appear before this Honourable court either personally or through an Advocate by **10.30 A.M** along with your documents failing which the matter will be decided in your absence as per Law.

MAJJI YOGESWARA RAO,
ADVOCATE,
VIZIANAGARAM .
Cell : 9440133743